మెదక్ మున్సిపాలిటీ : మెదక్ పట్టణంలోని నవాబుపేట గణనాథుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న నిర్వాహకులు

ఘనంగా గణపయ్యకు వీడ్కోలు

వినాయక నవరాత్రి ఉత్సవాలు పూర్తి కావడంతో సోమవారం భక్తులు వినాయకులను నిమజ్జనాలకు తరలించారు. తొమ్మిది రోజుల పాటు గణనాథుని కొలువులో భక్తి పారవశ్యం లో తలమునకలయ్యారు. ప్రతి వీధిలో ఏర్పాటైన గణనాథుని విగ్రహం తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా వేడుకలు జరుపుకొన్నది. చిన్నలు, పెద్దలు అంతా భక్తి పారవశ్యంతో గణేశ్ మహరాజ్ కీ జై అంటూ నిమజ్జనంలో నినాదాలు చేశారు. విఘ్నరాజాకు ప్రత్యేక పూజలు చేసి, తమ విఘ్నాలు తొలగిపోయేలా చూడాలని వేడుకున్నారు.

-మెదక్‌జిల్లా నెట్‌వర్క్, సెప్టెంబర్ 16

భక్తి శ్రద్ధలతో వినాయకుడికి నిమజ్జనాలు

చిన్నశంకరంపేట : గణపతి పూజలు నిర్వహిస్తున్న మహిళలు

నర్సాపూర్ : నాగులపల్లిలో వేలం పాటలో లడ్డూ దక్కించుకున్న తిరుపతి రెడ్డి

రూ.1.21 లక్షలు పలికిన లడ్డూ

నర్సాపూర్,సెప్టెంబర్16 : మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయం వద్ద ప్రతిష్ఠించిన వినాయకుడి లడ్డూ వేలం పాటలో రూ.1.21 లక్ష లు పలికింది. వేలం పాటలో ఈ లడ్డూను న్యూగ్లోబల్ విజన్ కన్సల్టెన్సీకి చెందిన తిరుపతి రెడ్డి దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రామకృష్ణరెడ్డి, తాళ్ల శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, సెప్టెంబర్ 16 : చండూర్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జనంలో గణేశుడి లడ్డూ వేలం పాటలో రూ. 40వేలకి గడ్డం శ్రీధర్‌రెడ్డి, రెండో లడ్డూ గడ్డం రాంరెడ్డి కైవసం చేస్తుకున్నట్లు రెడ్డి సంఘం సభ్యులు తెలిపారు. యాదవ్ కాలనీలో మొదటి లడ్డూ రూ.32వేలకు పాతూరి సాయి కృష్ణ,రెండో లడ్డూ పాతూరి మల్లేశం రూ.16వేలకు కైవసం చేస్తుకున్నట్లు సభ్యులు తెలిపారు.

చేగుంట : కర్నాల్‌పల్లి యువజన యూత్ సంఘం ఆధ్వర్యంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

రామాయంపేటలో వినాయకుడి శోభాయాత్ర

చిలిపిచెడ్ : చిట్కుల్‌లో వినాయక నిమజ్జనం నిర్వహిస్తున్న యువకులు

నర్సాపూర్‌లో నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య సంఘం మహిళలు

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి

ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబర్ 16 : గణేశ్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. గణేశ్ ఊరేగింపు సమయంలో గ్రామాల్లో విద్యుత్ తీగల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శోభాయాత్రలో పటాకులు కాల్చుట పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. నిమజ్జన సమయమున ఏమైనా ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూం 8712 657 888కి గానీ 100 డయల్ చేయాలని సూచించారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, సెప్టెంబర్ 16 : గణపతి నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గణేశ్ మండల నిర్వాహకులకు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి సూచించారు. నిమజ్జనం సందర్భంగా డీజే, లేజర్ లైటింగ్‌లకు అనుమతి లేదని, ఎవరైనా డీజే పెడితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శోభాయాత్ర ప్రశాంతంగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలి

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌జీటీ సంఘం నాయకులు

వెల్దుర్తి, సెప్టెంబర్ 16: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటుహక్కును కల్పించాలని కోరుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఎస్‌జీటీయూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం ఆధ్వర్యంలో సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సోమవారం కరీంనగర్‌లోని మంత్రి బండి సంజయ్ కార్యాలయం వద్ద ఎస్‌జీటీ సంఘం నాయకులతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలని, అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని విన్నవించామని తెలిపారు. ఈ విషయమై మంత్రి స్పందిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు ఓటు హక్కును కల్పిస్తామని హామీ నిచ్చారన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

వడియారం గోల్డన్ ఫంక్షన్‌హాల్‌లో పూర్వ విద్యార్థులు

చేగుంట, సెప్టెంబర్ 16 : చేగుంట మండలం రెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుకున్న 2006-07 పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు వడియారం లోని గోల్డన్ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఆనందాస్ నరేశ్, శంబుని రాజు, పరశురాములు, ప్రమోద్, స్వామి గౌడ్, సం తోష్, గోవర్ధన్, శారద, కవిత, శ్రీవాణి, లలి త, శిరీష, శోభ, నిర్మల, నవనీత, జీవన్, దాసు, యాదగిరి, అనంతం, శ్రీకాంత్, త దితరులు ఉన్నారు.

కట్ట మైసమ్మకు మొక్కులు

రామాయంపేట మండలంలో మైసమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న రైతులు

రామాయంపేట, సెప్టెంబర్ 16 : ఖరీఫ్‌లో వర్షాలు సమృద్ధిగా ఉండి చెరువులు, కుంటలు నిండిపోయాయి. దీంతో రామాయంపేట మండల వ్యాప్తంగా అలుగులు పారుతున్న చెరువు కుంటల వద్ద సోమవారం రైతులు, గ్రామస్తులు వివిధ గ్రామాల్లో ఉన్న కట్ట మైసమ్మ, ఊరడమ్మ, ఎల్లమ్మ గ్రామ దేవతలకు గ్రామస్తులు కొబ్బరి కాయలు కొట్టి, మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ దేవతలు కరుణించి ఇంకా మరిన్ని వర్షాలు కురువాలని గ్రామస్తులంతా మైసమ్మ దేవాలయం వద్దనే సహపంక్తి భోజనాలు చేశారు.

మహ్మద్ ప్రవక్తకు ప్రత్యేక ప్రార్థనలు

చేగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

చేగుంట, సెప్టెంబర్ 16 : మహ్మద్ ప్రవక్త జయంతి సందర్భంగా మండలకేంద్రమైన చేగుంటలో ముస్లింలు స్థానిక బస్టాండ్ నుంచి గ్రామ పురవీధుల్లో మీదుగా మసీద్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నిజాంపేట, సెప్టెంబర్16 : చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వెంకటాపూర్(కె) గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మ స్వామి (29) ఈ నెల 12న కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డిలోని తన బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో కంచర్ల వద్ద తను నడుపుతున్న బైక్ అదుపుతప్పి ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్వామి తలకు తీవ్రగాయాలు కాగా, మొదట సిద్దిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి.. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీకి తరలించారు. మూడు రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. స్వామి మృతితో గ్రామంలో విషాధచాయలు అలుముకున్నాయి. అశ్రునయనాల మధ్య సోమవారం అతడి అంత్యక్రియలను కుటుంబ సభ్యులు నిర్వహించారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, సెప్టెంబర్ 16 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్లాదుర్గంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నడిమి తండాకు చెందిన హనుమాండ్లు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఆదివారం రాత్రి అల్లాదుర్గం సమీపంలో 161వ జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పి పడిపోయాడు. ఈ ప్రమాదంలోఅతడికి బలమైన గాయాలయ్యాయి. దవాఖానకు తరలించగా, చికి త్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి అన్న మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసీఆర్ కాలనీలో పారిశుధ్య పనులు

రామాయంపేట, సెప్టెంబర్ 16 : రామాయంపేట పట్టణంలోని కేసీఆర్ కాలనీలో మున్సిపల్ కార్మికులు పరిశుభ్రతే ప్రధాన లక్ష్యంగా రోడ్లు, మురుగు కాల్వలను శుభ్రం చేశారు. సోమవారం పురపాలిక సిబ్బంది పోచమ్మల శంకర్ అధ్వర్యంలో 20 మంది పారిశుధ్య కార్మికులు కాలనీకి చేరుకుని చెత్తా చెదారాన్ని తొలిగించి రోడ్లపై ఉన్న మురుగును తీసివేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామాయంపేట, సెప్టెంబర్ 16 : మండల పరిధిలోని కాట్రియాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నేత మద్ది ముత్యాలు అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మెదక్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంటారెడ్డి తిరుపతిరెడ్డి నాయకుల ద్వారా మృతుడి అంత్యక్రియలకు రూ.5 వేల నగదును పంపించగా, బీఆర్ఎస్ నేతలు అందజేశారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్, సెప్టెంబర్ 16 : తూప్రాన్ మున్సిపల్ పరిధి పోతరాజ్ పల్లికి చెందిన వేణుగోపాల్ టోల్‌ప్లాజాలో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. వేణుగోపాల్ దయనీయ పరిస్థితిని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఎమ్మెస్సార్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శశిధర్ రెడ్డి రూ. 30 వేల నగదు సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు. వేణుగోపాల్ కుమారుడిని చదివించే బాధ్యత కూడా ఎమ్మెస్సార్ ఫౌండేషన్ తీసుకుంటుందని డాక్టర్ శశిధర్ తెలిపారు.

ఆర్థిక సాయం అందజేస్తున్న చైర్మన్ శశిధర్ రెడ్డి

దాతల సాయం

శివ్వంపేట, సెప్టెంబర్ 16 : శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామానికి చెందిన పంబలి నర్సింహులు అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబానికి పలువురు దాతలు అండగా నిలిచారు. మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్ గుప్తా రూ. 5 వేలు, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ రూ. 5 వేలు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి రూ. 7,500 ఆర్థికసాయం అందజేశారు. మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకుడు సంతోశ్ తదితరులు ఉన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ చర్యలు



మెదక్ మండలం కొంటూరు చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టామని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. సోమవారం మెదక్ పట్టణంలోని కొంటూరు చెరువు గణేశ్ నిమజ్జన ప్రాంతాల ఏర్పాట్లను కలెక్టర్ క్షేత్ర స్థాయిలో మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, ఈఈ మహేశ్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పా రు. మెదక్ పట్టణం, కొంటూరు చెరువు వద్ద బారికేడ్లు, 3 క్రేయిన్లు, 1 జేసీబీ, 10 మంది గజఈతగాలను లైటింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గణేశ్ విగ్రహ నిమజ్జనానికి వివిధ శాఖల అధికారులకు విధులు కేటాయించామని, వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిమజ్జనానికి పోలీసు బందోబస్తుతో సహా అన్ని ఏర్పాట్లు చేశామని, నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా ఉత్సవా కమిటీ సభ్యులు, గణేశ్ మండల్ నిర్వాహకులు ప్రజలు సహకరించి కలెక్టర్ కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు పూర్తిస్థాయిలో సామరస్య పూర్వక వాతావరణం ఉండేలా చూడాలన్నారు. నిమజ్జనం సాఫీగా ముగియాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ప్రజాపాలన నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

మెదక్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఎలాంటి ఇబ్బందులు రాకుండా మినిట్ టూ మినిట్ పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని ఐడీవోసీ కార్యాలయంలో నిర్వహించనున్న వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా తె లంగాణ రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ముఖ్య అతిథితో జాతీయ పతా క ఆవిష్కరణ ఉంటుందని ఆయన పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది ఉదయం 9 గంటలకు ఐడీవోసీ కార్యాలయానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, కలెక్టరేట్ ఏవో యూనస్, తహసీల్దార్ లక్ష్మణ్‌బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు చేరువగా ఆర్టీసీ సేవలు

సిద్దిపేట టౌన్,సెప్టెంబర్ 16 : ప్రయాణికులకు ప్రజా రవాణా ఆర్టీసీ మరింత చేరువగా సేవలు అందిచేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఆధునిక సాంకేతిక ఆధారంగా సీట్ల రిజర్వేషన్లను, డిజిటల్ లావాదేవీలను విజయవంతంగా నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో ఆర్టీసీ నూతనంగా కొత్త యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తీసుకువచ్చామని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి సోమవారం తెలిపారు. ఈ కోడ్ మరింత ఆధునికరించి యాప్‌కు అనుసంధానం చేసి క్యూఆర్ కోడ్ సాయంతో ఉన్నచోట నుంచే ఆర్టీసీ సేవలు పొందడానికి వీలుగా రూపొందించామన్నారు. వినియోగాదారులకు ఉపయోగపడేలా వేర్వేరు పది యాప్‌లు ఒకే చోట ఉంటాయని ఒక్కస్కాన్‌తో సేవలు చేతిలోకి వస్తాయని ప్రయాణికులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అయోధ్య రాముడికి మరోసారి దుబ్బాక చేనేత వస్త్రం

దుబ్బాక,సెప్టెంబర్16 : అయోధ్య బాలరాముడికి మరోసారి దుబ్బాక చేనేత వస్త్రం ధరింపజేశారు. ఢిల్లీకి చెందిన ముక్తీర్ ఫ్యాషన్ ఇండియా ప్రైవేట్ లిమిటేడ్ కంపెనీ వారి సహకారంతో దుబ్బాక పట్టణంలోని హ్యాండూమ్స్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ వారు తయారు చేసిన చేనేత వస్త్రాన్ని బాల రాముడికి ధరింపజేశారు. చేనేత మగ్గాలపై 80/100 లియాలెనిన్ ఫ్యాబ్రిక్‌తో గల 16 మీటర్ల తెలుపు రంగు వస్త్రాన్ని తయారు చేసి అందజేసినట్లు కంపెనీ వ్యవస్థాపకుడు బోడ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం అయోధ్య బాలరాముడి విగ్రహానికి దుబ్బాక చేనేత వస్త్రం మరోసారి ధరించండపై స్థానిక చేనేతలు సంతోషం వ్యక్తం చేశారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

నర్సాపూర్, సెప్టెంబర్16 : మనోహరాబాద్ మండలం గౌతోజిగూడ గ్రామంలో డప్పు కొట్టకుంటే కుల బహిష్కరణ చేస్తామన్న పలువురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పు కొట్టకుంటే కుల బహిష్కరణ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం వచ్చి నేటికి దేశంలో కుల వివక్ష కొనసాగడం సిగ్గుచేటని మండిపడ్డారు. యువతపై కావాలని ఉద్దేశపూర్వకంగా కుల వృత్తి నేపంతో డప్పు కొట్టకుంటే గ్రామం నుంచి బహిష్కరిస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎల్లయ్యకు ఉత్తమ సేవారత్న

గుమ్మడిదల, సెప్టెంబర్ 16: జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ ఆధ్వర్యంలో జానపద కళాకారుడికి తెలంగాణ రాష్ట్ర ఉత్తమ సేవారత్న అవార్డు అందజేశారు. మండలంలోని బొంతపల్లి గ్రామానికి చెందిన జానపద కళాకారుడు వడ్డెముద్దంగుల ఎల్లయ్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో జానపద గీతాలతో ఉద్యమాన్ని ఉధృతం చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈమేరకు జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు డాక్టర్ హెచ్ఎం డీ ముజాహిద్, జాతీయ చైర్మన్ షోయబ్, రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ రెహమాన్, రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ మహ్మద్ జహీర్ఇక్బాల్ ఎల్లయ్యకు అవార్డుతోపాటు ప్రశంసపత్రాన్ని అందించారు.

అవార్డు అందుకుంటున్న జానపద కళాకారుడు ఎల్లయ్య

గీతం స్కాలర్ శిరీషకు డాక్టరేట్

పటాన్‌చెరు, సెప్టెంబర్ 16: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని రసాయనశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని శిరీష బండి డాక్టరేట్ అర్హత సాధించారు. 'ఫొటోల్యూమిని సైన్స్ అధ్యయనాల కోసం రేర్ ఎర్త్ డోస్ట్ నానోఫాస్ఫర్ సంశ్లేషణ లక్షణం' అనే అంశంపై అధ్యాయనం చేసే సిద్ధాంత వ్యాసాన్ని శిరీష బండి సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం అసిస్టెంట్ డాక్టర్ ఫణిరాజా, సహ మార్గదర్శి డాక్టర్ నాగేంద్రకమార్ సోమవారం ఈ విషయాన్ని తెలిపారు. శిరీష సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడంపై గీతం విశ్వవిద్యాలయం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోరహర్ రెజా, రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం తదితరులు అభినందించారు.

108లో ప్రసవం..

కౌడిపల్లి, సెప్టెంబర్ 16 : మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి గర్భిణి పురిటి నొప్పులు రావడంతో మెదక్ ఎంసీహెచ్ దవాఖానకు తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి బాగాలేనందున వైద్యులు నీలోఫర్‌కు తీసుకెళ్లాలని సూచించారు. 108లో హైదరాబాద్ తరలిస్తుండగా గండి మైసమ్మ సూరారం మధ్యలో పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో గమనించిన 108 సిబ్బంది వాహనాన్ని పక్కకు నిలిపి ప్రసవం చేశారు. ఆమె మగ కవలలకు జన్మనిచ్చింది. అనంతరం ఆమెను కుటుంబ సభ్యుల ఇష్టానుసారం మల్లారెడ్డి దవాఖానకు తరలించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు సిబ్బంది తెలిపారు.